

అంబేడ్కర్ యూనివర్సిటీలో అంతర్గత పాలనా నియామకాలు

ఎచ్చెర్ల, జూలై 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పలు పాలనా పరమైన అంతర్గత నియామకాలకు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ఉత్తర్వులు జారీ చేశారు. వర్సిటీలోని వివిధ కార్యాలయాలు, పాలనా విభాగాలకు సమన్వయకర్తలు, అసిస్టెంట్ డీన్‌లు మొత్తం 8 మందిని నియమించారు. ఈ మేరకు నియామక పత్రాలను వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత బుధవారం అందజేశారు.

- ఇంకా పూర్తికాని గృహ నిర్మాణాలు
- అయినా రుణాలు చెల్లించాలని బ్యాంకు నోటీసులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- ఆత్మహత్యలే శరణ్యమంటున్న వైనం



నిర్మాణాలు పూర్తికాకుండానే గోడలకు రంగులు వేసిన దృశ్యం

గత సర్కారు పాపం..
టిడ్కో లబ్ధిదారులకు శాపం

గత సర్కారు పాపం టిడ్కో లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. ఇళ్లను పూర్తిచేసి అందజేస్తామని నమ్మబలికి లబ్ధిదారులతో బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని తమ ఖాతాలో జమచేయించుంది జగన్ సర్కారు. ఆ రుణాలను మింగేసి గృహ నిర్మాణాలను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేసింది. ఎన్నికల ముందు ఓట్లు పొందేందుకు నిర్మాణాలు పూర్తి చేసినట్లు గోడలకు రంగులు వేసి కలరింగ్ ఇచ్చింది. వాస్త వానికి ఆ గృహాల పరిస్థితి పైన పటారం.. లోన లుటారం అన్నట్లు ఉంది. అయితే, ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకుండానే తీసుకున్న రుణం వడ్డీతో చెల్లించాలని బ్యాంకులు నోటీసులు ఇవ్వడంతో లబ్ధిదారులు కంగుతిన్నారు. లేని ఇళ్లకు తాము ఎలా రుణం చెల్లిస్తామని, ఆత్మహత్యలే తమకు శరణ్యమని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

(పలాస)

పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో 2014-2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన-ఎన్టీఆర్ గృహ నిర్మాణపథకం (ఏహెచ్‌పీ) ద్వారా పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం బొడ్డపాడు రెవిన్యూ పరిధిలో 1,968 టిడ్కో గృహాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. అందులో 365 చదరపు అడుగుల గృహాలు 912, 300 చదరపు అడుగుల గృహాలు 816, 430 చదరపు అడుగుల గృహాలు 240 నిర్మించడానికి సంకల్పించింది. ఇందుకోసం రూ.115 కోట్లు విడుదల చేసింది. 2019 ఎన్నికల నాటికి మొత్తం 950 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణంపై విషం చిమ్మింది. ఇందులో అవకతవకలు జరిగాయంటూ రివర్స్ టెండర్లు పిలుస్తామని చెప్పి పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేశాయి. ఇక్కడ టాటా నిర్మాణ సంస్థ ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. లాభాపేక్ష లేకుండా కేవలం అభివృద్ధిలో తాము భాగస్వాములవుతామని, వృత్తినైపుణ్యశిక్షణ ఇచ్చి నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పిస్తామని చెబుతూ ఈ రంగంలోకి అడుగుపెట్టింది. వైసీపీ ప్రభుత్వ విధానం కారణంగా ఆ సంస్థ పనులను సగంలోనే విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో తామే గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇస్తామని వైసీపీ ప్రభుత్వం నమ్మబలికింది. దీనికోసం ముందుగానే లబ్ధిదారుల నుంచి బ్యాంకు రుణాలు తీయించి ప్రభుత్వ ఖాతాలో జమ చేసింది. అందుకు గాను లబ్ధిదారులకు సంబంధిత గృహాలను ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది.



అధ్వానంగా ఉన్న టిడ్కో గృహాల సముదాయం

పూర్తికాని గృహ సముదాయం..

లబ్ధిదారుల నుంచి రుణాలు పొందిన వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలను పూర్తిగా విస్మరించింది. కేవలం ఎన్నికలు సమీపిస్తున్నాయనే కారణంతో గోడలకు రంగులు వేసి నిర్మాణాలు పూర్తిచేసినట్లు బిల్డప్ ఇచ్చింది. కానీ, వాస్తవానికి ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తికాలేదు. రహదారులు, మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించలేదు. నాణ్యత లేకపోవడంతో తలుపులు, కిటికీలు, ద్వారబంధాలు పాడయ్యాయి. ప్రస్తుతం గృహ నిర్మాణాలను పరిశీలిస్తే ఇంకా 40 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జగన్ సర్కారు ఒత్తిళ్లు చేయడంతో బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు ఇచ్చేశారు. భవనాలు ఎంత మేరకు పూర్తయ్యాయి, లబ్ధిదారుల నుంచి వడ్డీ, అసలు వసూలు చేసుకోగలమా, వారిపై ఒత్తిళ్లు తీసుకురావాలా.. లేక ప్రభుత్వపైనా అనేది కూడా కనీసం చూడకుండా బ్యాంకర్లు రుణాలు ఇచ్చేశారు.

ఇళ్లకు అంటించిన నోటీసులు



లబ్ధిదారులకు కేటాయించిన గృహాల వద్ద నోటీసు అంటించిన దృశ్యం

ప్రస్తుతం ఏహెచ్‌పీ గృహ సముదాయం వద్ద అనేక మంది బ్యాంకర్లు లబ్ధిదారుల ఇళ్లకు నోటీసులు అంటించారు. తీసుకున్న రుణానికి అసలు, వడ్డీ కలిపి చెల్లించాలని, లేకుంటే బ్యాంకు నిబంధనల ప్రకారం జప్తు చేయాల్సి వస్తుందని నోటీసులో పేర్కొనడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 4న ఒక దినపత్రికలో ప్రకటన కూడా విడుదల చేశారు. ఇప్పటికే తాము వేల రూపాయలు చెల్లిస్తూ అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నామని, లేని ఇళ్లకు తాము అప్పులు ఏ విధంగా తీర్చుతామో బ్యాంకర్లు సమాధానం చెప్పాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తమపై ఒత్తిళ్లు తీసుకువస్తే ఆత్మహత్యలు తప్పా మరే మార్గం లేదని వారు చెబుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా సత్వరమే గృహ నిర్మాణాలు పూర్తి చేసి అందించాలని వేడుకుంటున్నారు.



పోర్టు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పనులు ఎంతవరకు వచ్చాయి?

- మూలపేట పోర్టును పరిశీలించిన కలెక్టర్
- భూసేకరణ, రైతులకు పరిహారంపై ఆరా

సంతబొమ్మాళి, జూలై 10: జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం మూలపేట పోర్టును పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, వాటి స్థితిగతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పవర్ ప్రజెంటేషన్ ద్వారా విశ్వసముద్ర కంపెనీ ప్రతినిధులు, పోర్టు అధికారులు పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. భూసేకరణ, ఇంకా పరిహారం ఎంత మందికి చెల్లించాలి, రైతుల డిమాండ్లు, తదితర విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సౌత్ బ్రేక్ వాటర్, బెర్త్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆర్అండ్ఆర్ కాలనీ, రైల్వే ట్రాక్, సాల్ట్ భూములను పరిశీలించారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమల్, తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలి..

కలెక్టరేట్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల ఆవరణలు, తరగతి గదుల్లో ఎలాంటి చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల నిర్వహణ, ఏజెన్సీల పనితీరు మెరుగుపడాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందించే విధంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. డీఈవో వెంకటేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి బి.అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సర్పంచ్‌లదే అధికారం?

- పంచాయతీలతో సచివాలయాలు అనుసంధానం
- తద్వారా గ్రామాల అభివృద్ధి
- ప్రయత్నాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం

ఇచ్ఛాపురం, జూలై 10: పంచాయతీలకు మంచి రోజులు రానున్నాయి. సర్పంచ్‌లకు మళ్లీ అధికారాలు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు గ్రామ పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకురావడంతో పంచాయతీలు తీవ్ర గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు మంజూరైన 14, 15 ఆర్థిక సంఘం నిధులను వైసీపీ సర్కారు ఇతర అవసరాలకు దారిమళ్లించేది. దీంతో పాలక వర్గాలు ఉత్సవ విగ్రహాల్లా మారాయి. అయితే, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థకు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని యోచిస్తోంది. సచివాలయాలను గ్రామ పంచాయతీలతో అనుసంధానం చేసేలా అడుగులు వేస్తోంది. సర్పంచ్‌లకే పూర్తి అధికారాలు అప్పగించాలని భావిస్తోంది. జిల్లాలో 30 మండలాల పరిధిలో 912 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 647 సచివాలయాలు ఉన్నాయి. కార్పొరేషన్, మున్సిపాల్టీల పరిధిలో మరో 75 సచివాలయాలు (ఇచ్ఛాపురం-10, పలాస-16, ఆమదాలవలస-11, శ్రీకాకుళం-38)ఉన్నాయి. అయితే, ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా గ్రామ పంచాయతీలకు వెళ్లకుండా సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. సచివాలయాల నిర్వహణ బాధ్యత పంచాయతీలకు ఉన్నా అందులో పనిచేసే ఉద్యోగులు వారి పరిధిలో లేకుండా పోయారు. పర్యవేక్షణను రెవెన్యూ శాఖకు అప్పగించింది గత ప్రభుత్వం. కనీసం పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేయడానికి కూడా అభ్యంతరాలు తెలిపింది. తమకు హక్కులు కల్పించాలని సర్పంచ్‌లు పలుమార్లు వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పాలకులు పట్టించుకోలేదు. దీంతో అటు సర్పంచులు కాని ఇటు పంచాయతీ కార్యదర్శులుగాని ఏమీ చేయలేకపోయారు. నిధుల ఖర్చు విషయంలో జగన్ సర్కారు కట్టడి చేయడంతో పంచాయతీల్లో కనీస వసతులు సమకూర్చడానికి ఆపసోపాలు పడ్డారు. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య కార్మికులకు వేతనాలను సకాలంలో చెల్లించలేకయారు. చిన్నచిన్న మరమ్మతు పనులకు బిల్లులు ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆదాయం ఉన్న పంచాయతీలదీ ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో పంచాయతీ వ్యవస్థకు గత వైభవం తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపడుతున్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అధికారులతో వరుసగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను పంచాయతీలకు అనుసంధానం చేసేందుకు కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సర్పంచ్‌లకు అధికారం అప్పగించడం ద్వారా గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజలకు సత్వర సేవలు అందుబాటులోకి తెచ్చేలా అడుగులు వేస్తోంది.



లొద్దపుట్టి సచివాలయం

విద్యార్థుల చేతికే కాస్మెటిక్స్



గురుకుల విద్యార్థులు

- కొనుగోలు చేసి ఇచ్చేందుకు చర్యలు
- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం
- తప్పనున్న ఇబ్బందులు


మెళియాపుట్టి, జూలై 10: గిరిజన విద్యార్థులకు కాస్మెటిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి అందించనుంది. ఈ మేరకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులతో చర్చించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు రెండేళ్లుగా కాస్మెటిక్ చార్జీలు చెల్లించలేదు. తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి వేయలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో బాలుర ఆశ్రమ పాఠశాలలు 18, బాలికల ఆశ్రమ పాఠశాలలు 11, పోస్టు మెట్రిక్ వసతిగృహాలు 6, గురుకుల రెసిడెన్సీ పాఠశాల, కళాశాల, మినీ గురుకులం, ఏకలవ్య పాఠశాల ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 8,733 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి కొబ్బరినూనె, షాంపులు, దుస్తుల సబ్బులు, స్నానాల సబ్బులు, బ్రష్, టూత్‌పేస్టు, తదితర సామగ్రి కొనుగోలుకు కాస్మెటిక్ చార్జీల కింద నెలకు బాలురుకు రూ.155, బాలికలకు రూ.185 వరకు చెల్లించాల్సి ఉంది. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలను సక్రమంగా చెల్లించలేదు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మొదటి రెండేళ్లు కొవిడ్ కారణంగా విద్యార్థులకు పూర్తిగా



కాస్మెటిక్ చార్జీలు అందించలేదు. మిగతా మూడేళ్లూ కూడా ఇదే పరిస్థితి. తల్లిదండ్రుల ఖాతాలో నగదు జమ చేస్తామని, దానితో తమ పిల్లలకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేసి అందించాలని చెప్పింది. కానీ, సక్రమంగా చార్జీలు చెల్లించకపోవడంతో తల్లిదండ్రులు తమ సొంత డబ్బులతో పిల్లలకు అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి అందించేవారు. దీనివల్ల వారిపై ఆర్థిక భారం పడేది. రూ.1.50 కోట్లు గత ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమచేయకుండా మోసం చేసింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 2014-19 వరకు గిరిజన కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలిచి విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేసేవారు. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. మళ్లీ ఇదే విధానం అమలు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. దీనివల్ల గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే అవకాశం కూడా ఉంటుందని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగాల పేరిట మోసం

- రూ.లక్షలు వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి
- వాహనం ఇప్పిస్తానని కూడా ..
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- ఇప్పటికే ఆ ఉద్యోగిపై కేసులు



సతీష్‌బాబుకు జారీచేసిన నోటీసు

శ్రీకాకుళం క్రైమ్, జూలై 10: తన కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి నుంచి రూ.లక్ష తీసుకున్నాడు ఓ పంచాయతీ కార్యదర్శి. దీనికి ముందు ప్రభుత్వం నుంచి వాహనం ఇప్పిస్తానని అదే వ్యక్తి నుంచి మరో రూ.లక్ష తీసుకున్నాడు. ఈ రెండూ దక్కకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్ పోలీసులు, బాధితుడు, పంచాయతీ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు. మందస మండలం లోహరి బంద పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న మన్నం సతీష్‌బాబు.. శ్రీకాకుళం నగరంలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మైగాపు గౌరీశంకర్ అనే వ్యక్తికి ప్రభుత్వం నుంచి వాహనం ఇప్పిస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో శంకర్ నుంచి రూ.1.36లక్షలు వసూలు చేశాడు. అలాగే శంకర్ కొడుకుకు ఉద్యోగం ఇప్పిస్తానని మరో లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఏడాది గడిచిన వాహనం రాకపోగా, కొడుకుకి ఉద్యోగం కూడా ఇప్పించకపోవటంతో సతీష్‌బాబును శంకర్ నిలదీశాడు. దీంతో తనకు సంబంధం లేదని సతీష్ చెప్పడంతో బాధితుడు బుధవారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. తనకు న్యాయం చేయాలని, డబ్బులు తిరిగి ఇప్పించాలంటూ జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఇదిలా ఉండగా సతీష్‌బాబుపై ఇప్పటికే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఉద్యోగాల పేరిట మోసం చేశాడని రెండు కేసులు గతంలో నమోదయ్యాయని పోలీసులు తెలిపారు.

'మీ కోసం'లో మరో బాధితుడు ఫిర్యాదు..

నగరంలోని క్రిస్టియన్ కాలనీలో నివశిస్తున్న పిళ్లా నరేష్ అనే యువకుడికి ఇండియన్ బ్యాంకులో మెసెంజర్ ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది అక్టోబరు 30 నుంచి ఈ ఏడాది జనవరి వరకు దశల వారీగా ఫోన్‌పే ద్వారా రూ.5,11,392 లక్షలు తీసుకుని సతీష్‌బాబు మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై బాధితుడు ఈ నెల 1న కలెక్టర్ మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు సతీష్‌బాబుకు నోటీసులు ఇవ్వాలని మందస ఎంపీడీవోకు.. డీపీవో సూచించారు. ఈ మేరకు సతీష్‌బాబుకు నోటీసులు జారీ చేసి ఈ నెల 12న శాఖాపరమైన విచారణకు హాజరుకావాలని ఎంపీడీవో ఆదేశించారు. అయితే గతంలో సరుబుజ్జిలిలో సతీష్‌బాబు ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ కూడా అయినట్లు పంచాయతీశాఖ అధికారులు వివరించారు.

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో
బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్

దిక్సూచి DIKSUCHI

పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్న గూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



బైపీసీ స్ట్రీమ్

ఈ స్కీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఎ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపీ, పులివెందుల) క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎన్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్‌లు

పుణెలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ)-పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 24 సీట్లు ఉన్నాయి.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సుకు బీఎస్సీ(జనరల్/అగ్రికల్చర్/ఫిషరీస్/నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ)/బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్సీ(బ్లెండెడ్)పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(వైన్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కెమిస్ట్రీ/అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/హార్టికల్చర్); పీజీడీఐఎఫ్ఏటీ/బీటెక్(కెమికల్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.

పీజీ డిప్లొమా

- **షుగర్ టెక్నాలజీ(ఎస్‌టీ):** ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ప్రవేశానికి బీఎస్సీ(షుగర్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్/ఎంపీసీ)/బీటెక్(కెమికల్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 50 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- **ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ(ఐఎఫ్ఏటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 22 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ, వైన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆల్కహాల్ టెక్నాలజీ సబ్జెక్టులలో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.



- **షుగర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎస్ఐటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులు; బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
- షుగర్ ఇంజనీరింగ్ డిప్లొమా(ఎస్ఈడీ): ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఇందులో ప్రవేశానికి బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్(ఎస్ఈసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. షుగర్‌మిల్లులో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. ఇందులో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్(ఎస్ఎంసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీఎస్సీ(కెమిస్ట్రీ/షుగర్ టెక్నాలజీ)/డిప్లొమా(షుగర్ టెక్నాలజీ/షుగర్ మాన్యుఫాక్చర్/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఇందులో 35 సీట్లు ఉన్నాయి.

సర్టిఫికెట్

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్(ఎస్‌బీసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- **జ్యూస్ సూపర్విజన్ సర్టిఫికెట్(జేఎస్‌సీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **ఈటీపీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్టిఫికెట్(ఈటీపీఓఎం):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** ఎమ్మెస్సీ కోర్సులకు జూలై 23న; పీజీ డిప్లొమా(ఐఎఫ్ఏటీ)కి జూలై 24న
- **ఇంటర్వ్యూలు:** జూలై 23 - 25
- **వెబ్‌సైట్:** www.vsisugar.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jVHfrSTలో చదవండి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:ఆయనంక బోస్.

తిన్నడి విల్లు కథ




మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయారు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతూల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

● పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు ● నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది
విష్వక్ సేన్



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

ప్రేక్షకులను రప్పించడం ముఖ్యం



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు

తిరుమల (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది" అని అన్నారు.

షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?



బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీ రంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mITke5z లో చదవండి.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

టెక్కలి: వ్యాపారులు అధిక ధరలకు నిత్యావసర సరుకులు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ నూరుల్ ఖమర్ హెచ్చరించారు. బుధవారం టెక్కలిలో రాజేష్ హోల్‌సేల్ కిరాణా దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. కందిపప్పు రూ.160కు విక్రయించాలని సూచించారు. సామాన్య ప్రజలకు అందుబాటు ధరలలో ఉండేవిధంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. నాణ్యత గల కందిపప్పు అందుబాటు ధరలకు వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, వర్తక సంఘ నాయకులు లాడి శ్రీనివాసరావు, తహసీల్దార్ మురళీకృష్ణ, డీకే రాజేష్, ప్రసాద్‌రెడ్డి, లవకుమార్, కామేసు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

నరసన్నపేట: కొత్త చట్టాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని స్థానిక సివిల్ కోర్టు జడ్జి హరిప్రియ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును ఆమె ప్రారంభించారు. వివిధ చట్టాలపై న్యాయవాదులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు జామి కామేశ్వరరావు, గొండు అప్పారావు, డి.రాజ్‌కుమార్, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

టెక్కలి: జగతిమెట్ట దరి జగనన్న లేఅవుట్ కాలనీని బుధవారం సబ్‌కలెక్టర్ నూరుల్‌ఖమర్ ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఇచ్చిన పట్టాలు ఎన్ని ఎంతమంది నిర్మాణాలు చేశారు? ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయి వంటి వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు. తప్పిదాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరితో పాటు తహసీల్దార్ మురళీకృష్ణ ఉన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

వజ్రపుకొత్తూరు: బెండి ప్రాథమిక పాఠశాలలో పలాస- కాశీబుగ్గ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలకు టేబుల్, కుర్చీలను బుధవారం అందించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు, విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకులు హనుమంతు వెండిదొర వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శి వెండిదొర, మాధవరావు, ఎస్.అప్పారావు, కె.రామన్న, వి.వెంకటరావు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్‌లో దివ్యాంగుడి ప్రతిభ

టెక్కలి: ఈనెల 10న యుగాండాలో జరిగిన పారా బ్యాడ్మింటన్ పోటీల్లో టెక్కలి మండలం శ్రీరంగం గ్రామానికి చెందిన చాపర పూర్ణ ప్రతిభ కనబరిచాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం, మెన్స్ డబుల్స్‌లో వెండి పతకం, సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. గతంలో జరిగిన ఓ ప్రమాదంలో పూర్ణ రెండుకాళ్లు, నడుము విరిగినప్పటికీ ప్రతిభ కనబరచడంపై పలువురు అభినందించారు.

పాఠశాల పరిశీలన

కొత్తూరు: గులివిందలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారులు గోవింద, శ్రీనివాసరావు బుధవారం సందర్శించారు. విద్యారుల డిక్టేషన్ పుస్తకాలు చూశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు.

బ్రాహ్మణులపై వ్యాఖ్యలు సరికావు

పలాస: బ్రాహ్మణులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న పైల దాస్ అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలాస బ్రాహ్మణ వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం కాశీబుగ్గ సీఐ విజయానంద్‌కు ఆ సంఘ నాయకులు ధర్మపురి అనిల్‌శర్మ ఫిర్యాదు చేశారు. ఆయన వెంట పురోహితులు ఎం.రామప్రసాద్‌శర్మ, మురళీకృష్ణశర్మ, ఎస్.బాలమురళీకృష్ణశర్మ, విశ్వనాథశర్మ, రమేష్‌శర్మ, నాగరాజుశర్మ ఉన్నారు.

కోర్టు కేసులపై అధికారులతో చర్చ

పలాస రూరల్: పలాస నియోజకవర్గంతో పాటు డివిజన్‌లో గల తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో కోర్టు కేసుల అంశాలు, వాటి పూర్వాపరాలపై ఆర్డీవో భరత్‌నాయక్ డీటీ, సీనియర్ అసిస్టెంట్లతో ఆర్డీవో కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఏయే కేసులు ఉన్నాయి..వాటి ప్రస్తుత పరిస్థితిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీటీలు గిరి, భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

నందిగాం: మండలంలో మిగులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పారదర్శకంగా చేపట్టాలని సంఘాల ప్రతినిధులు సూచించారు. బుధవారం నందిగాం ఎంఆర్‌సీలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం జరిగింది. విద్యార్థుల కిట్ల రవాణా చార్జీలు చెల్లించాలని, సేవా పుస్తకాలు అప్‌డేట్ చేయాలని ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావుల దృష్టిలో పెట్టి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక శంకరరావు, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, బీటీఏ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించి లేఅవుట్

● రెడ్డికపేట గ్రామస్థుల ఆరోపణ

నరసన్నపేట: గొట్టిపల్లి పంచాయతీ రెడ్డికపేట గ్రామ ప్రజల అవసరాల కోసం సర్వే నెంబరు 36లో గల 7.60 ఎకరాలలో కప్ప కర్ర చెరువును తవ్వి తమ పూర్వీకులు ఇస్తే... దానికి కొందరు స్వార్థపరులు గత ప్రభుత్వ కాలంలో పాసు పుస్తకాలను సృష్టించి అక్రమ లే అవుట్‌లు వేశారని కవిటికి చెందిన బెండాళం నారాయణమూర్తి అన్నారు. బుధవారం రెడ్డికపేట గ్రామస్థులతో కలిసి లే అవుట్‌లో బోర్డును ఏర్పాటు చేశారు. ఈ వివాదం జిల్లా కోర్టులో ఉందని, క్రయవిక్రయాలు చేయరాదని నారాయణమూర్తి అన్నారు. 7.60 ఎకరాల చెరువును గ్రామ ప్రజలు అవసరాలకే తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.



లే అవుట్ వద్ద బోర్డు ఏర్పాటు చేసిన దాత వారసులు, గ్రామస్థులు



వరాహనరసింహునిగా జగన్నాథుడు

ఒడిశా

పర్లాకిమిడి: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామి వారు బుధవారం వరాహనరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పర్లాకిమిడిలోని గుడించా మందిరం వద్దకు చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పర్లాకిమిడి: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని జిల్లా అదనపు కలెక్టర్ రాజేంద్ర వింజ్ అన్నారు. బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన రథాన్ని ప్రారంభించారు. ఈ ప్రచార రథం ఆగస్టు 31వరకు పురవీధుల్లో తిరుగుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధ్యక్షురాలు నిర్మలాశెట్టి, ఉపాధ్యక్షులు మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం

పర్లాకిమిడి: జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని స్థానిక జిల్లా పంచాయితీ వనరుల సమావేశ మందిరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాజేంద్ర వింజ్ దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి లిష బెహరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రీతంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకతో జీవితాల్లో మార్పు

● ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం సామాన్యుల జీవితాలలో గణనీయమైన మార్పు తీసుకు రానుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర ప్రగతికి బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంజీఆర్ కార్యాలయ ప్రాంగణం నుంచి ఆలాంధ్ర రోడ్ కూడలి వరకూ బుధవారం సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడుగునా పాల్గొన్న ఇసుక ట్రాక్టర్లు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ కూడలిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉచిత ఇసుకతో పేదవారి సొంతింటి కల నెరవేరనుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల జీవితాలలో ప్రగతి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీవరప్రసాద్, టీడీపీ మండల, పట్టణశాఖాధ్యక్షులు పైల బాబ్జీ, సైలాడ సతీష్, ఎస్.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

ఇబ్బందులు తొలిగాయి..

పలాస: ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్య ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి మార్గం సులభమైందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉచిత ఇసుక రీచ్‌లు ప్రారంభించడంతో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అధిక ధరలకు అమ్మకాలు చేయడంతో నిర్మాణ రంగం కుదేలైందని.. కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, శాసనపురి మురళీకృష్ణ, తమ్మినాన గంగారామ్, జోగ మల్లి, డొక్కరి శంకర్, యవ్వారి మోహనరావు, ధర్మపురి అనిల్‌శర్మ, దడియాల నర్సింహులు, పాండురంగారావు పాల్గొన్నారు.



పలాసలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు

సాగర తీరానికి రహదారులు

● ఆలయాలకు కూడా..

● పర్యాటక శాఖ ప్రతిపాదనలు

టెక్కలి: జిల్లాలోని తీరప్రాంతంలో గల 12 బీచ్‌లకు వెళ్లే కచ్చా రహదారులను బీటీ రోడ్లుగా, అలాగే ఆరు దేవాలయాలకు సంబంధించి అవసరమైన సీసీ రోడ్ల ఏర్పాటుకు పర్యాటక శాఖ ప్రతిపాదించింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఈ పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారులు అందించాలని డుమా పీడీ జీవీ చిట్టిరాజు ఉత్తర్వులు జారీచేశారు. ఇచ్ఛాపురం, కవిటి, గార, ఎచ్చెర్ల, రణస్థలం మండలాల పరిధిలో ఈ రహదారులు రానున్నాయి. ఇచ్ఛాపురం మండలం డొంకూరు, కవిటి మండలం బైరెడ్లపుట్టుగ, కపాసుకుద్ది, కవిటి, పుక్కళ్లపాలెంలో రోడ్లు వేయనున్నారు. గార మండలం బలరాంపురం, మత్స్యలేశం, మొగదలపాడుకు బీచ్‌లకు రహదారులు నిర్మించనున్నారు. ఎచ్చెర్ల మండలం దిబ్బలపాలెం, బుడగట్లపాలెం, రణస్థలం మండలం జీరుపాలెం బీచ్‌లకు బీటీ రహదారులు వేయనున్నారు. కంచిలి మండలం మకరాంపురం భూలోకమ్మ గుడికి, కొత్తూరు లక్ష్మీనరసింహస్వామి, పిడిమందస పాలపోలమ్మ, అరసవెల్లి సూర్యనారాయణస్వామి గుడి ప్రాంతంలో సీసీ రోడ్లు నిర్మించనున్నారు. గార మండలం నగరాలపేట బుద్ధిస్ట మోర్నమెంట్‌కు, రావివలస ఎండలమల్లికార్జునస్వామి ఆలయానికి చేరుకునే రోడ్డు, జలుమూరు మండలం శ్రీముఖలింగం దేవాలయం వరకు సీసీ రోడ్లు అవసరమని ప్రతిపాదనలు చేశారు.

గిరిజన పోరాటాలు స్ఫూర్తిదాయకం

పలాస రూరల్: శ్రీకాకుళం సాయుధ గిరిజన పోరులో నాడు ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యంలు చేసిన త్యాగాలు మరువకూడదని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. తర్లాకోట పంచాయతీ కొరారింగి తాళభద్రలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం 54వ వర్ధంతి సభ సందర్భంగా గ్రామంలో గిరిజనులతో ర్యాలీ, అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యంల స్ఫూర్తితోనే గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్ లో చేర్చారని గుర్తు చేశారు. అడవులపై హక్కులు గిరిజనులకే చెందేలా చూడాలన్నారు. జిల్లాకు ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.భీమారావు, తాతారావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వంకల పాపయ్య, ఏడీఎస్‌కేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, సవర సోమేశ్వరరావు, సవర భవన్, పాపారావు, ఆనంద్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతమే లక్ష్యం

టెక్కలి: క్షేత్రస్థాయిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. బుధవారం బూరగాం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో తాగు, సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పశువైద్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. టీడీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, సంజీవరెడ్డి, రూపావతి, రమణయ్య, శ్రీనివాస్, మల్లేసు, కనకరాజు, అరుణ్ తదితరులు ఉన్నారు.



టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బగాది శేషగిరి



శ్రీను చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

శ్రీను కుటుంబాన్ని ఆదుకుంటాం

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు: చిన్నదూగాం సర్పంచ్ ప్రతినిధి పీస శ్రీనివాసరావు మృతి టీడీపీకి తీరని లోటని, వారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చిన్నదూగాంలో బుధవారం నిర్వహించిన పీస శ్రీనివాసరావు సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నదూగాం అభివృద్ధితో పాటు ప్రజల సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి శ్రీనివాసరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నాయకులు బగ్గు గోవిందరావు, గుండ మన్మథరావు, పీస కృష్ణ, దుంగ స్వామిబాబు, కత్తిరి వెంకటరమణ, బైరి భాస్కరరావు, గుండ రామకృష్ణ, వాన వామనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలి

టెక్కలి: ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మణరావు, జిల్లా కార్యదర్శి చిలుకు కృష్ణారావులు కోరారు. బుధవారం సాయంత్రం టెక్కలిలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ జీవోనెం.117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలల్లో యథాతథంగా ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించాలన్నారు. మౌలిక వసతుల అభివృద్ధి బాధ్యతల నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకులు వై.హరిబాబు, సీతారాజు, హేమలత, రమాదేవి, గోవిందరావు, వెంకటరమణ, మధుబాబు, విశ్వనాథం పాల్గొన్నారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం

పోలాకి: పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఢిల్లీ, చెన్నై, విశాఖపట్నం, రాజమండ్రి ప్రాంతాల ప్రతినిధులతో కూడా బృందం బుధవారం పరిశీలించింది. ఆరోగ్యకేంద్ర పరిధిలో ఉన్న లేబొరేటరీని పరిశీలించి క్షయ వ్యాధిగ్రస్థుల శాంపిల్స్ ఎన్ని చేశారనే రికార్డులు పరిశీలించారు. క్షయ వ్యాధి బారిన పడిన వారికి చికిత్స అందుతుందా? మందులున్నాయా? ల్యాబ్‌కు ఆధునిక పరికరాలు సరఫరా చేస్తున్నారా? టీబీ వైద్యులను నియమించారా అని ల్యాబ్ టెక్నీషియన్ రంధి సుజాతను అడిగి తెలుసుకున్నారు. 12 రకాల రికార్డులను, గతంలో తీసిన ల్యాబ్ శాంపిల్స్‌ను పరిశీలించారు. బృంద నాయకురాలు డా.విద్యామిధి, సుచరిత, రవిశంకర్, డీపీఎస్ రఘు, డీటీసీ మల్లేసు, ల్యాబ్ టెక్నీషియన్ ఆర్.సుజాత తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బృందం నాయకురాలు డా.విద్యామిధి విలేకరులతో మాట్లాడుతూ రాజమండ్రి, విజయనగరం, పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మంజూరు చేసిన ల్యాబ్‌ల నిర్వహణను పరిశీలించాలని ఉన్నతాధికారులు పంపించారని తెలిపారు.



రక్త నమూనాల వివరాలను పరిశీలిస్తున్న బృందం

కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

మందస: మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని పూర్వ విద్యార్థులు ఆర్‌జేడీ ఐ.శారదకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలని.. కాలేజీని ఇక్కడే కొనసాగించాలని కోరారు. ఒడియా, తెలుగు విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం మంజూరు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వడ్డి గోపాలకృష్ణ, శ్రీనివాస్ పాడి, ఆర్.దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



ఆర్‌జేడీకి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మత్తు పదార్థాల నుంచి కాపాడండి

నరసన్నపేట: మత్తు పదార్థాల భారి నుంచి యువత, విద్యార్థులను రక్షించాలని ఏఐవైఎఫ్ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం చేపట్టారు. సంఘ నాయకులు యుగంధర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున గంజాయి వ్యాపారం సాగుతోందని, పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. నరసన్నపేట పట్టణంలోని పెద్దపేట, మార్కెట్ వీధుల్లో గంజాయి అమ్ముతున్నా పట్టించుకోవడం లేదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించండి

కాశీబుగ్గ: ముస్లిం మైనార్టీల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆ వర్గం పెద్దలు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ జామియా మసీదులో బుధవారం జిల్లా టీడీపీ ముస్లిం మైనార్టీల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా మైనార్టీ పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు ఎస్‌కెఎండీగౌస్ మాట్లాడుతూ వక్ఫ్ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, శ్మశాన వాటికలు, ప్రహరీ నిర్మాణం, షాదీ ఖానాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జామియా మసీదు ప్రెసిడెంట్ ఎస్‌కే బాషా, కార్యదర్శి ఎస్‌కే బషీర్, నిజాముద్దీన్, బహుదుర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి చొరవతో రోడ్డుకు మోక్షం

టెక్కలి: నౌపడ-మెళియాపుట్టి రోడ్డు. ఆంధ్రా, ఒడిశాలను కలుపుతూ ఎంతో ప్రాధాన్యం కలిగిన రోడ్డు ఇది. టెక్కలి సమీపంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ వంతెన ముందు రోడ్డుపై భారీగా గోతులు పడ్డాయి. పోర్టు, గ్రానైట్‌కు చెందిన భారీ వాహనాలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుండడంతో ఇక్కడ ఛిద్రమైంది. ఈ గోతులను ఆర్‌అండ్‌బీ యంత్రాంగం పట్టించుకోలేదు. వర్షం పడినప్పుడు బురదనీరు చేరి గోతులు కనిపించక ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఇది చూసిన టెక్కలికి చెందిన యువకుడు నూనెల కుమార్ బుధవారం స్వచ్ఛందంగా గోతులు పూడ్చేందుకు శ్రీకారం చుట్టాడు. అవసరమైన సిమ్మెంట్, చిప్స్, ఇసుక తదితర సామాగ్రి తెప్పించి గోతులు పూడ్పించాడు. దీంతో అతన్ని స్థానికులు అభినందిస్తున్నారు.



రోడ్డుపై గోతులను పూడ్పిస్తున్న దృశ్యం

ద్విచక్ర వాహనం చోరీ

నరసన్నపేట: స్థానిక సౌభాగ్యలక్ష్మీ నగర్‌లో ఉంటున్న గనగల రాంబాబుకు చెందిన ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి చోరీకి గురైనట్టు ఏఎస్ఐ అసిరినాయుడు తెలిపారు. రాత్రి 10 గంటలు సమయం వరకు ఇంటి ఆవరణలో పార్కు చేసి వాహనం ఉండేదని, తెల్లవారి చూసేసరికి వాహనం లేకపోవడంతో చోరీకి గురైనట్టు గుర్తించిన రాంబాబు ఫిర్యాదు చేశారన్నారు. కాగా ఇటీవల కాలంగా జాతీయ రహదారికి సమీపంలో గల శ్రీనివాసనగర్, సౌభాగ్యలక్ష్మీనగర్, శ్రీరామనగర్, మారుతీనగర్ తదితర చోట్ల ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడంతో పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై కేసు నమోదు

జలుమూరు: కులం పేరుతో దూషించి అవమానించిన వారిపై సైరిగాం పంచాయతీ లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన గొర్లె అసిరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ రాజశేఖర్ తెలిపారు. చెరువు వద్ద చేపలు తీస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ధర్మాన మౌళి, కొర్ను సరస్వతి, కొర్ను రమణ, ధర్మాన సత్యం కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మిజోరం గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్


ఎన్ఈఆర్‌ను సత్కరిస్తున్న గవర్నర్

రణస్థలం: మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు బుధవారం విశాఖలో ఆయన్ని కలుసుకున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిస్థితులను ఎమ్మెల్యే వివరించారు.

తీర ప్రాంతంలో గస్తీ ముమ్మరం

గార: సముద్ర తీరంలో నిర్వహించే సాగర్ కవచ్‌లో భాగంగా బుధవారం సాయంత్రం డీఎస్పీ శేషాద్రినాయుడు మొగదాలపాడు, వత్సవలస తదితర గ్రామాల్లో పర్యటించి పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. సముద్ర తీరం నుంచి అనుమానితులు ఎవరైనా గ్రామాల్లోకి వస్తే ఏ విధంగా స్పందించాలో వారికి వివరించారు. అలాగే సముద్ర తీర గ్రామాల్లో కూడా అపరిచిత వ్యక్తుల కదలికలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గార ఎస్.ఐ. కె.కృష్ణ ప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేని వ్యాపారం తగదు


మాట్లాడుతున్న ఏసీ రాణిమోహన్

శ్రీకాకుళం రూరల్: వ్యాపారులు ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారం చేయడం తగదని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.రాణిమోహన్ అన్నారు. స్థానిక వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో బుధవారం వివిధ వర్తక సంఘాలు, అకౌంటెంట్ సభ్యులతో జీఎస్టీ ఫెసిలిటేషన్ డ్రైవ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వ్యాపారులకు సహకారం అందిస్తామన్నారు. కాంపోజిషన్ ట్యాక్స్ పరిధిలో ఉన్న వారు నార్మల్ ట్యాక్స్ పరిధిలోకి రావాలని దీనివల్ల కలిగే ఉపయోగాలను వ్యాపారులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి.ప్రతిభ దేవి, జీఎస్టీ అధికారి జి.హైమావతి, బీవీటీ రమణరావు, వర్తక సంఘాల నాయకులు సాంబమూర్తి, మెట్ట నాగరాజు, శ్రీను, ఆనంద్, ఆడిటర్స్ ప్రతినిధి శ్యామ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జనసేన పార్టీ నాయకులు


కలెక్టర్‌ను సన్మానిస్తున్న జనసేన పార్టీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ని బుధవారం జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందిచారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్, ప్రచార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు, కె.అనిల్ కుమార్, విజకృష్ణ, ఉదయ్, గురుప్రసాద్ ఉన్నారు.

నగరంలో జాబ్ మేళా రేపు

అరసవల్లి: బలగ జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐ కేంద్రంలో జిల్లా ఉపాధి అధికారి ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు ఉపాధి అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెడ్ ప్లస్, ఇనోవ్ స్పోర్ట్స్ కంపెనీల్లో 67 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ డీ/బీ/ఎం, ఏదైనా డిగ్రీ విద్యార్హత గల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఆ రోజున ఉదయం 10.00 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలని కోరారు. ఎంపికైనవారు పలాస, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఎర్ర గోవిందపుట్టుగలో ఉత్సవం


సూర్య పూజలో పాల్గొన్న భక్తులు

కవిటి: పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో చింతామణి ఆలయ ప్రారంభోత్సంలో భాగంగా రెండో రోజు బుధవారం గో పూజ, సూర్య నమస్కారాలు చేపట్టారు. గ్రామస్థులంతా కలసికట్టుగా నిర్మించిన ఈ ఆలయాల్లో గురువారం నిర్వహించే ఉత్సవానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. చండీయాగాన్ని నిర్వహిస్తున్నామని గ్రామస్థులు తెలిపారు.

చెత్త కుప్పలపై కలెక్టర్ ఆగ్రహం.. స్పందించిన యంత్రాంగం


చెత్తను తొలగిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: వంశధార రిజర్వాయర్ పరిశీలనకు మంగళవారం వెళ్లిన కలెక్టర్ స్వప్నికల్ దినకరన్ పుండ్కర్ తిరుగు ప్రయాణంలో మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను చూసి వెంటనే ఎంపీడీవో ఎం.రత్నంతో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో బుధవారం అన్ని సచివాలయాల కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు మొత్తం మండల కేంద్రంలో వాలిపోయారు. ప్రతి ఇంటికి వెళ్లి శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. రహదారులు పక్క చెత్త కుప్పలు, పిచ్చి మొక్కలు తొలగించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఆమదాలవలస: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బుధవారం మండలంలోని కొర్లకోటలో శానిటేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా పాల్గొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.



అరసవల్లి: ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు


అరసవల్లి: ఏడు రోడ్ల కూడలిలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో..


పాతపట్నం: ఎమ్మెల్యే ఎంజీఆర్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

● కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిల భారత కోర్కెల దినం

అరసవల్లి: కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా తమ నిరసనను తెలియ జేస్తూ స్థానిక డే అండ్ నైట్ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ బీవీ రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కో-కన్వీనర్ గోవర్ధనరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్, పార్వతీశం, బలరాం, బి.చిన్నారావు, నాగేశ్వరరావు, బి.జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షురాలు కల్యాణి, సంఘ ప్రతినిధులు కె.జ్యోతి, వై.లీలా రత్నకుమారి, పద్మజ, ఎస్.కృష్ణ భారతి, డి.ముత్యాలమ్మ, ఇ.అప్పలనరసమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తం వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అఖిల భారత కోర్కెల దినం చేపట్టారు.


ఎచ్చెర్ల: తహసీల్దార్ కార్యాలయం వద్ద..


ఎల్ఎన్‌పేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద



పలాస రూరల్: ర్యాలీలో కార్మిక సంఘ నాయకులు



నరసన్నపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద..



టెక్కలి: ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



నందిగాం: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


జలుమూరు: డీటీకి వినతిపత్రం..


మెళియాపుట్టి: తహసీల్దార్‌కు..



పోలాకి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..


సారవకోట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం అర్బన్: నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా బుధవారం ఎల్‌బీఎస్ కాలనీ, పద్మావతినగర్, తోటపాలెం, గుజరాతీపేట, నవభారత్ జంక్షన్, నీలమ్మ కాలనీల్లో జరుగుతునన పారిశుధ్య పనులను పరిశీలించారు. నీలమ్మ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్ నుంచి మురుగునీరు రోడ్డుపైకి రావడంతో అక్కడి నివాసులతో మాట్లాడి.. తాత్కాలికంగా రోడ్డుకి ఎదురుగా ఉన్న కాళీ స్థలంలోకి మురుగు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. కాలువలు నిర్మించేందుకు సిబ్బందికి ఆదేశించారు.

హెల్మెట్ వాడకం తప్పనిసరి


మాట్లాడుతున్న న్యాయాధికారి పరీష్‌కుమార్

ఇచ్ఛాపురం: ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి పి.పరీష్‌కుమార్ అన్నారు. బుధవారం కోర్టు చాంబర్‌లో న్యాయవాదులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు నందికి రమణయ్యరెడ్డి న్యాయవాదులు రంగారావు, సీతయ్యరెడ్డి, ఎ.నాగరాజుపాత్రో, మనోజ్‌కుమార్, భైరాగిరెడ్డి, జగ్గారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

వైభవంగా ద్విశతావధానం


ద్విశతావధానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్ర కళాసమితి, అరసవల్లి దేవస్థానం సంయుక్తంగా నిర్వహిస్తున్న ద్విశతావధానం అరసవల్లి ఇంద్రపుష్కరిణి వద్ద గల వైజయంతి ఉత్సవ వేదికపై బుధవారం ప్రారంభమయింది. పులఖండం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అవధాని బులుసు అపర్ణ అనర్గళంగా సమస్యా పూరణలు చేసి, ఆహుతులను అలరించారు. మొత్తం 216 మందితో ఐదు రోజులపాటు అవధానం కార్యక్రమంలో జరుగుతుందన్నార. కార్యక్రమంలో మండవిల్లి రవి, నక్క శంకరరావు, నీరజా సుబ్రహ్మణ్యం, వీవీఆర్ మూర్తి, కొమ్మనాపల్లి సురేష్, మురళీధర్, పూజ తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

బూర్జ: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఉపాధి ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా ఉపాధి పనులు, వాటికి వెచ్చించిన నిధులు, రికవరీ సంబంధించిన వివరాలను రిసోర్స్‌పర్సన్లు చదివి వినిపించారు. ఉపాధి పనుల్లో అ క్రమాలు జరుగుతుంటే చర్యలు తీసుకోరా అంటూ టీడీపీ నాయకులు కృష్ణ, సోమినాయుడు బెనర్జీ ప్రశ్నించారు. ముఖ్యంగా మండలంలో తుడ్డలి, డొంకలపర్త, లంక, లక్కుపురం, ఓవీపేట, నీలంపేట పంచాయతీల్లో ఉపాధి నిధులను వీఆర్‌పీలు పక్కదారి పట్టించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రాధ, జిల్లా నిఘా విజిలెన్స్ అధికారి లోవరాజు, ఏపీవో రాజ్‌కుమార్, జడ్పీటీసీ రామారావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణంనాయుడు, ప్రత్యేక ఆహ్వానితులు నాగేశ్వరరావు, గోపి మాస్టార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

జి.సిగడాం: మెట్టవలస గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యులు బెవర జగన్నాథరావు కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు బుధవారం పరామర్శించారు. జగన్నాథరావు తండ్రి చిన్నంనాయుడు ఇటీవల మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకుని రామ్‌మల్లిక్ ఆ గ్రామానికి వెళ్లి సంతాపాన్ని తెలిపారు. సర్పంచ్ కామోజుల ఆరుద్ర, కూటమి నాయకులు బెవర లక్ష్మీ, కామోజుల సీతారాం, టంకాల రమణ, బెవర బాల, విక్రం కాశీబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

కంచిలి: జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అబ్దుల్ కలాం కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆ కాలనీ వాసులు ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రామయ్యపుట్టుగలో కలసి వినతి పత్రం అందజేశారు. నెలరోజుల్లో సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఈశ్వరి, జానకి, రామలక్ష్మీ, పార్వతి, భాగ్యలక్ష్మీ, కళావతి, మోహన్‌రావు, బాబూరావు, మాదిన ప్రదీప్ తదితరులు ఉన్నారు.

ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ రామయ్యపుట్టుగలో తన స్వగృహం వద్ద బుధవారం ఆర్ అండ్ బీ అధికారులతో సమీక్షించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రహదారి పనులపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గానికి రూ.1,82కోట్లు నిధులు మంజూరైనట్టు అధికా రులు తెలిపారు. 13 రహదారుల మరమ్మతులకు నిధులు వెచ్చించనున్నట్టు తెలిపారు. రహదారులు పక్కన జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని అధికరులకు ఎమ్మెల్యే అశోక్ సూచించారు.

ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలి


చంద్రబాబు, పవన్ చిత్రపటాలు అందిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు చేరేలా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని కూటమి నాయకులు పైడి మురళీమోహన్, కిల్లి సిద్ధార్థ అన్నారు. బుధవారం పురుషోత్తపురం గ్రామంలో గ్రామ సచివాలయ సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి చం ద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రజలకు పథకాలను చేరువ చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పటాలను అందించారు. కూటమి నాయకులు కిల్లి గోపి, పైడి కృష్ణ, కిల్లి రాజారావు, కొత్తకోట విష్ణు, పప్పల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే.!

● ప్రమాదాలకు కేంద్రంగా మారిన కొత్తబ్రిడ్జి


విరిగిపడిన ఇనుప రక్షణ వలయం


పుట్ పాత్‌పై విరిగిపడి ఉన్న ఇనుప రాడ్లు

శ్రీకాకుళం అర్బన్: నిత్యం రద్దీగా ఉండే మార్గం, సాయంత్రమైతే చల్లగాలి కోసం చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు సేదతీరే మార్గం... ఈ క్రమంలో ఆదమరిచి నడిచారో ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో ఉన్న బ్రిడ్జి పై ప్రజల రక్షణ కోసం కొన్నాళ్ల కిందట ఇరువైపులా ఇనుప వలయాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడవి తుప్పు పట్టి కొన్ని చోట్ల ఐరన్ రాడ్లు విరిగిపోవడంతో పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. బ్రిడ్జి నుంచి డేఅండ్ నైట్ కూడలి వైపు వచ్చే తొవలో రక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇనుప వలయం విరిగిపోవడంతో అదుపు తప్పితే వాహనాలు గొయ్యిలో పడి ప్రమాదాలు జరిగే పరిస్థి నెలకొంది. అధికారులు మాత్రం తమకు పట్టనట్టు వదిలేశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి విరిగిన ఇనుప రక్షణ వలయాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పారిశుధ్యంపై దృష్టి సారించాలి

జి.సిగడాం: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సంతవురిటి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపె అవగాహన కల్పించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి హెచ్చరించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను ఎప్పటికప్పుడు తీయించాలన్నారు. ఎంపీడీవో వెంకన్నబాబు, ఈవోఆర్డీ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.ల

ఆసుపత్రికి పరికరాలు అందజేత

సోంపేట: స్థానిక సామాజిక ఆసుపత్రికి రోటరీ నూతన అధ్యక్షుడు జుత్తు చలపతి ఆధ్వర్యంలో బుధవారం రూ.25 వేలు విలువచేసే స్ప్రేయర్, బీపీ మిషన్, డయాబెటిక్ మిషన్ తదితర పరికరాలను ఆసుపత్రి వైద్యులు తుంగాన వెంకటేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనారాయణ, రోటరీ కార్యదర్శి శివాజీ, రోటరీ జిల్లా పబ్లిక్ ఇమేజెస్ చైర్మెన్ దుద్ది శ్రీనివాసరావు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రామావతారంలో జగన్నాథుడు



శ్రీకాకుళం కల్చరల్: జగన్నాథ స్వామి రథయాత్రలో భాగంగా బుధవారం స్వామి వారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మొం డేటి వీధిలోని లలిత సహిత శివకామేశ్వర స్వామి వారి ఆలయం, షిర్డీ సాయిబాబా మందిరం ఆవర ణలో, గుజరాతి పేట జగన్నాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

'రిమ్స్ అన్నపూర్ణ' పథకానికి వితరణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం రిమ్స్ నిత్య అన్నపూర్ణ పథకానికి పట్టణానికి చెందిన రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగి పి.శివన్నారాయణ దంపతులు బుధవారం రూ.10వేలు విరాళంగా అందచేసినట్టు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. గత 12 ఏళ్లగా ఈ రిమ్స్ ఆసుపత్రిలో నిరాటంకంగా రోగుల సహాయకులకు ఈ పథకం ద్వారా మధ్యాహ్నం, రాత్రి సుమారు 500 మందికి ఆహారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా సేవా సమన్వయకర్త పప్పల నాగేశ్వరరావు, మేనేజర్ లక్ష్మణరావు, వెంకటరావు, శ్రీరాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కంచిలి: సచివాలయ ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని ఎంపీడీవో వి.నీరజ అన్నారు. డీజీపురం సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులు పరిశీలించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంటురోగాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి కె.వంశీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 79 మంది ఎంపిక

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 79 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాలో 116 మంది ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు హాజరుకాగా రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేశారు. నెల్లూరులోని ఆల్‌స్టోమ్, ఇసూజు మోటార్స్ లిమిటెడ్, ఇన్ఫిలూమ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, అలాగే అనంతపురానికి చెందిన హుందాయ్ మోబిస్, ఏసీటీ, కేఐఎంఎల్, కేఎస్‌హెచ్, తిరుపతిలోని డిక్షాన్ తదితర పరిశ్రమల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 నుంచి 18,000 వరకు జీతం ఉంటుందన్నారు. ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ కామేశ్వరరావు, విద్యాసాగర్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తక్షణమే జీతాలు చెల్లించాలి

పొందూరు: సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో కేజీబీవీ, ఎంఆర్‌సీ, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి కోరారు. లోలుగు కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు రెండునెలలు జీతాలు చెల్లించాల్సి ఉందని మూడో నెల వస్తున్నా ఇంకా జీతాలు అందలేదని తెలిపారు. అర్హులైన ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

సాగు భూములకు పట్టాలు ఇప్పించండి

కవిటి: శాసనాం, నువాగడ గ్రామాల సమీపంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గిరిజనులు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. పట్టాలు లేకపోవటంతో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ పథకం అందకుండా పోయిందని వారంతా వాపోయారు. గిరిజన ప్రాంతాలకు రహదారి, ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని వారు వినతిలో కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ కన్వీనర్ ఐ.లోకనాథం, హరిచంద్ర, దీనబంధు, సోమేష్, గణేష్ ఉన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై లోకాయుక్తకు ఫిర్యాదు

పొందూరు: వైద్యఆరోగ్యశాఖలో బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినవారిపై చర్యలు తీసుకోకపోవడంతో పాటు వారికే ఉద్యోగ క్రమబద్ధీకరణలో ప్రాధాన్యం ఇవ్వడంపై వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులపై ప్రభుత్వ సంస్థల్లో శిక్షణ పొందిన హెల్త్ అసిస్టెంట్లు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ సంస్థలో శిక్షణ పొందిన బాధితులైన హెల్త్ అసిస్టెంట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 273 జీవోను అడ్డుపెట్టుకుని అక్రమ పద్ధతుల్లో ప్రైవేట్ సంస్థల్లో బోగస్ సర్టిఫికెట్లను పొంది ఉద్యోగం పొందారని, వారి నుంచి కొంతమంది అధికారులు లంచాలు తీసుకుని గత ప్రభుత్వంలో క్రమబద్ధీకరణ చేశారని అన్నివిధాలా అర్హులైన తమకు అన్యాయం చేశారని లోకాయుక్త ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.